సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



చక్రస్నానం.. సర్వపాపహరణం

పులివెందుల నడిబొడ్డులో వెలసిన శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. - 8లో



దయగల తల్లి.. లూర్దుమాత

దయగల తల్లి అమలోద్భవి లూర్దుమాత సన్నిధి అత్యంత పవిత్రమైనదని, భక్తులకు ప్రీతికరమైనదని ఫాదర్ లక్కినేని ఆరోగ్యస్వామి అన్నారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /16.0

వాతావరణం

జిల్లాలో సోమవారం 16.0 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి
– జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



బాధితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులు ఆదేశించారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

జీఎన్ఎస్ఎస్ ఎస్‌డీసీగా రవిశంకర్‌రెడ్డి బాధ్యతలు



రవిశంకర్‌రెడ్డి

కడప సిటీ : గాలేరు–నగరి సుజల స్రవంతి(జీఎన్ఎస్ఎస్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ)గా ఎ.రవిశంకర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రోహిణి అనంతపురం హెచ్ఎన్ఎస్ఎస్‌కు బదిలీ అయ్యారు. అట్లూరుకు చెందిన కృష్ణకుమార్‌రెడ్డి, మాజీ వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మానందరెడ్డిలు ఆయనను సత్కరించారు. రవిశంకర్‌రెడ్డి రాయచోటి తహసీల్దార్‌గా పనిచేస్తుండగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. 2011లో ఉద్యోగంలో చేరిన ఆయన కడప ఆర్డీఓ ఏఓగా, సీకే దిన్నె, కడప, కమలాపురం, దువ్వూరు, రాజంపేట, రాయచోటి మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ భూ సేకరణకు సంబంధించిన పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.

షూటింగ్ బాల్ పోటీలకు జట్ల ఎంపిక



క్రీడాకారులతో ప్రిన్సిపల్, తదితరులు

వేంపల్లె : సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు పురుషుల, మహిళల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ కళాశాల ప్రాంగణంలో షూటింగ్ బాల్ పురుషుల, మహి ళా జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీవరకు కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారటీ జిల్లా కార్యదర్శి ఎం.నిత్య పూజయ్య, పీడీ తేజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

8లోగా విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లు ప్రీప్రైమరీ (ఎల్‌కేజీ, యూకేజీ) విద్యార్థుల వివరాలను ఈనెల 8వ తేదీలోగా చైల్డ్ ఇన్ఫో పోర్టల్‌లో నమోదు చేయాలని డీఈఓ దేవరాజు తెలిపారు. జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు వారి పరిధిలోని అన్ని ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్‌లకు ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు.

ఆర్టీసీ శిక్షణ..ఉపాధికి నిచ్చెన

- ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవింగ్ స్కూలు నిర్వహణ
- వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాల నివారణపై చర్యలు
- ఇప్పటికే 13 బ్యాచ్‌లకు ముగిసిన శిక్షణా కార్యక్రమాలు



శిక్షణ పొందిన అభ్యర్థులతో ఇన్‌స్ట్రక్టర్ ఎస్‌ఏ జబ్బార్ (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : డ్రైవింగ్ పట్ల ఆసక్తిగల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారు తాము ఎంచుకున్న వృత్తిలో రాణించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ తోడ్పాటు అందిస్తోంది. రాష్ట్రంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీఎస్ ఆర్టీసీ నేతృత్వంలో పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ప్రత్యేక డ్రైవింగ్ స్కూలు ఏర్పాటు చేసి అన్ని అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఆర్టీసీ కడప డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రైవింగ్ స్కూలులో ఒక్కో బ్యాచ్‌లో 16 మందిని తీసుకుని అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నారు. 30 సంవత్సరాల అనుభవం గల రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లతో థియరీ క్లాసులు,సుదీర్ఘ అనుభవం గల డ్రైవింగ్ ఫ్యాకల్టీలతో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తున్నారు.

అనుభజ్ఞులైన మెకానిక్‌లతో వాహన విడిభాగాలపై అవగాహన

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు హెవీ వాహనాలపై డ్రైవింగ్ శిక్షణ, వాహనాల విడిభాగాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. వాటి పనితీరును సమగ్రంగా తెలియజేస్తున్నారు. అలాగే రోడ్లపై ఉండే పెయింటింగ్ మార్కులు, సైన్ బోర్డులు, సిగ్నల్ బోర్డుల గురించి వివరిస్తున్నారు. ప్రతిరోజు ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరిచేత 10–15 కిలోమీటర్లు బస్సును నడిపించడం, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరు చూపించి వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేస్తున్నారు. ఆర్టీసీ గ్యారేజీలో అనుభవం గల మెకానిక్‌లతో వాహన విడిభాగాలు, వాటి పనితీరు, సామర్థ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. సైడ్ మిర్రర్ ఆధారంగా బస్సు రివర్స్ చేయడం, హెచ్ మార్కు రివర్స్ చేయడం, ఘాట్ రోడ్డులో ఎలాంటి భయాందోళనలు లేకుండా బస్సును నడపడంలాంటి అంశాల్లో డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో వారు ఎంచుకున్న డ్రైవింగ్ రంగంలో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు భవిష్యత్తులో సంస్థలో ఏర్పడే ఖాళీల భర్తీలో తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటివరకు డ్రైవింగ్ స్కూలు ద్వారా 13 బ్యాచ్‌లకు సంబంధించి 208 మందికి శిక్షణ ఇవ్వగా ప్రస్తుతం 14వ బ్యాచ్ శిక్షణకు అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇతర వివరాలకు కడప డిపో మేనేజర్ 99592 25774, కడప డీఐ 73828 65145 నంబర్లలో సంప్రదించాల్సి ఉంటుంది.

దేశ విదేశాల్లో రాణిస్తున్న డ్రైవర్లు

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్ పొందిన డ్రైవర్లు దేశ విదేశాల్లో రాణిస్తున్నారు. ముఖ్యంగా కువైట్, సౌదీ అరేబియా, ఖత్తర్, బెహరీన్ తదితర గల్ఫ్ దేశాలతోపాటు భారతదేశంలోని పలు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ శిక్షణ గురించి తెలుసుకున్న పలువురు మహిళలు కూడా డ్రైవింగ్‌లో శిక్షణ పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు.



శిక్షణలో బస్సును నడుపుతున్న నజీనా బేగం (ఫైల్)

సద్వినియోగం చేసుకోవాలి



డ్రైవింగ్ స్కూలు ద్వారా అభ్యర్థులు జీవితంలో స్థిరపడేలా అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నాం. వాహనాన్ని నడపడంలోనే కాకుండా వాహన విడిభాగాలు, వాటి పనితీరుపై కూడా అవగాహన కల్పిస్తున్నాం. తద్వారా డ్రైవర్లు తమ శిక్షణ పూర్తయ్యే నాటికి వాహనాల పనితీరు గురించి కూడా సమగ్రంగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.తక్కువ ఫీజుతో ఇస్తున్న ఈ శిక్షణను డ్రైవింగ్ పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.
– గోపాల్‌రెడ్డి, రీజినల్ మేనేజర్, ఏపీఎస్ ఆర్టీసీ, కడప

జీవితంలో స్థిరడేందుకు మంచి అవకాశం



నిరుద్యోగ యువత జీవితంలో స్థిరపడేందుకు డ్రైవింగ్ శిక్షణ ఎంతగానో ఉపయోగ దుతుంది. ప్రాక్టికల్, థియరీ క్లాసుల ద్వారా అభ్యర్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం.అభ్యర్థులు ఒక్క డ్రైవింగ్‌లో మాత్రమే కాకుండా వాహన నిర్వహణ విషయంగా కూడా శిక్షణ ఇస్తున్నాం.ఇక్కడ శిక్షణ పొందిన అనేక మంది దేశ, విదేశాల్లో స్థిరపడటం సంతోషంగా ఉంది.
– ఢిల్లీశ్వర్‌రావు, ప్రిన్సిపాల్, ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలు, కడప

డ్రైవింగ్‌లో రాణించేలా శిక్షణ



ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న డ్రైవింగ్ స్కూలులో చేరిన వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. డ్రైవింగ్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలియజేస్తూ అభ్యర్థుల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం. శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలి.
– ఎస్‌ఏ జబ్బార్, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్, కడప

పూర్తి స్థాయిలో అవగాహన



ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ ద్వారా డ్రైవింగ్‌తోపాటు వాహనాల నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగింది. ఇక్కడ చేరే సమయంలో తనకు డ్రైవింగ్ గురించి పెద్దగా తెలియదు. ప్రాక్టికల్, థియరీ క్లాసులు ఎంతగానో ఉపయోగపడ్డాయి. భవిష్యత్తులో డ్రైవింగ్ వృత్తిలో రాణించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.
– ఎస్‌ఎండీ గౌస్‌మోహిద్దీన్, డ్రైవర్, కడప

నేడు వైఎస్సాఆర్‌టీఎఫ్ సర్వసభ్య సమావేశం

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 7వ తేదీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అమర్నాథ్‌రెడ్డి, రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లా పరిషత్‌కు సమీపంలోని వైఎస్సార్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో సాయంత్రం 5 గంటలకు జిల్లా సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ కుటుంబ సభ్యులంతా హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అభివృద్ధితోపాటు కార్యచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు వైఎస్సార్ బస్ టర్మినల్ ప్రారంభం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో నిర్మించిన వైఎస్సార్ బస్ టర్మినల్‌ను ఈనెల 8వ తేదీన ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ డీఎం ఉమా మహేశ్వరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ బస్ టర్మినల్ బస్టాండును ప్రారంభించారని, బుధవారం బస్టాండు నుంచి వివిధ ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడపనున్నామని తెలిపారు. ప్రస్తుతం తాత్కాలింగా మార్కెట్ యార్డు నుంచి వెళుతున్నాయన్నారు. రేపటి నుంచి ప్రయాణికులు వైఎస్సార్ బస్సు టెర్మినల్ బస్టాండులో బస్సుల కోసం వేచి ఉండవచ్చని చెప్పారు.

స్పెషల్‌డ్రైవ్‌లో 242 కేసులు నమోదు

కడప అర్బన్: జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా సోమవారం నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపిన వారిపై మొత్తం 242 కేసులు నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 222, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు తదితర వాహనాల డ్రైవర్లపై 20 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

- 13 మంది సభ్యులతో వన్‌స్టాప్ క్రైసిస్ టీమ్ ఏర్పాటు
- ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.ఎన్. మూర్తి



కడప అర్బన్ : జిల్లాలో మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరి నిర్మూలన కోసం 13 మంది సభ్యులతో వన్‌స్టాప్ క్రైసిస్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.ఎన్. మూర్తి తెలియజేశారు. సోమవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయసేవాసదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ వారి సహకారంతో మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరిల నిర్మూలనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.ఎన్. మూర్తి మాట్లాడుతూ 13 మంది సభ్యుల బృందం జిల్లావ్యాప్తంగా మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ, నిర్మూలనకోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తారని, బాధితులను గుర్తిస్తారన్నారు. తద్వారా వారికి న్యాయ సహాయం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం వెట్టిచాకిరి పని విధానాన్ని నిర్మూలిద్దాం– వ్యక్తి స్వతంత్రాన్ని పరిరక్షిద్దాం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎస్. కవిత, కడప దిశ మహిళా అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రెడ్డివారి వాసుదేవన్, రైడ్స్ సంస్థ ప్రతినిధి త్యాగరాజు, ప్యానల్ న్యాయవాది చంద్రకాంతమ్మ, పారాలీగల్ వలంటీర్ దశరథరామిరెడ్డి, ఇంటర్‌నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధి శ్యామ్ పాల్గొన్నారు.

విపత్తు సమయాల్లో ప్రజలకు అండగా నిలవాలి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : తుఫాన్లు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులు సంభవించిన సమయాల్లో ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా ప్రజలను ఆదుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలిపారు. జెడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో సోమవారం వివిధ మండలాల కమ్యూనిటీ వలంటీర్లతో 12 రోజులపాటు ప్రారంభమైన శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తులు సంభవించినపుడు ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ దళాలు వచ్చేవరకు ఆగకుండా ప్రజలను రక్షించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఉద్దేశంతోనే క్షేత్రస్థాయిలో కమ్యూనిటీ వలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకురావడం వల్ల కరోనా సమయంలో వలంటీర్లు ఎన్నో విలువైన సేవలను సకాలంలో ప్రజలకు అందించగలిగారన్నారు. వలంటరీ వ్యవస్థ పటిష్టంగా ఉంది గనుకే కరోనా వ్యాధిగ్రస్తులకు సంబంధించిన 'క్షేత్రస్థాయి సమాచారం ప్రభుత్వానికి అందడంతో తగిన చర్యలు తీసుకోవడానికి సాధ్యపడిందని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ కొనసాగితేనే ఇలాంటి వ్యవస్థలు పటిష్టంగా ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు విదేశాల ప్రశంసలు పొందాయని చెప్పారు దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఆంధ్ర రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాయని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ఆశా, ఏఎన్ఎం వలంటీర్లు ఫీవర్ సర్వే వంటి కార్యక్రమాల ద్వారా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. అన్నమయ్య డ్యాం తెగిపోయి కొన్ని గ్రామాల ప్రజలు నిరాశ్రయులైనపుడు జిల్లా పరిషత్ చైర్మన్ అమరనాథరెడ్డి అన్ని తానై సహాయ సహకారాలు అందించారని తెలిపారు. వలంటీర్లకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు బాలయ్య, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

13,14 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్





పులివెందులలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డీఈఓ దేవరాజుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి

పులివెందులలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా నిర్వహణ

కడప ఎడ్యుకేషన్ : జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమం ఈనెల 13,14 తేదీల్లో నిర్వహించాలని రాష్ట్రస్థాయి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు డీఈఓ దేవరాజు, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ విషయమై వారు వారు మాట్లాడుతూ జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌ను పులివెందులోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎస్సీఈఆర్టీ వారి సూచనలతో ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్, ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్, వాతావరణ మార్పులు,మ్యాథ్స్ మోడలింగ్ అనే ఐదు అంశాలపై సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందులో 180 మంది విద్యార్థులు తమ ఇన్నోవేషన్ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. సైన్స్‌ఫేర్ నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేయాలని సోమవారం జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. మండలస్థాయిలో ప్రథమస్థానం సాధించిన వారు మాత్రమే జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్‌కు అర్హులని తెలిపారు. ఏ అంశంలో విద్యార్థులు ఎంపికయ్యారో అందులోనే ప్రాతినిధ్యం వహించాలని చెప్పారు. ప్రతి ప్రాజెక్టుకు ఒక విద్యార్థి, గైడ్ టీచర్ మాత్రమే హాజరుకావాలన్నారు. జిల్లాస్థాయి సైన్స్ పేరు కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు, గైడ్ టీచర్‌కు భోజనం, వసతి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఎంఈఓ మీ మండలంలో ఎంపికైన ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన విద్యార్థులు తప్పని సరిగా హాజరయ్యేలా బాధ్యత తీసుకోవాలని డీఈఓ దేవరాజు సూచించారు.

రేపు జిల్లాకు జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు రాక

కడప సిటీ : జాతీయ అల్ప సంఖ్యాక మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది బుధవారం జిల్లా పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె 7వ తేదీ రాత్రి చిత్తూరు జిల్లా నుంచి బయలుదేరి కడపకు చేరుకుంటారన్నారు. బుధవారం ఉద యం 11 గంటలకు కడపలోని అమీన్‌పీర్ దర్గాను దర్శించుకుంటారని చెప్పారు.తర్వాత మైనార్టీ సామాజిక వర్గాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమంపై కలెక్టర్, ఎస్పీ, ఇతర మైనార్టీ అధికారులతో సమావేశమవుతారని తెలిపారు. 3 గంటలకు పెండింగ్‌సమస్యలపై అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. 3.30 గంటలకు కలెక్టరేట్‌లో వీడియా సమావేశంలో ఆమె మాట్లాడతారని, అనంతరం రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళతారని కలెక్టర్ వివరించారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

- త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్ విజయరామరాజు



ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహించవద్దని, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్‌వర్మ, శిక్షణ కలెక్టర్ రాహుల్‌మీనా, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, నరసింహులు, చంద్రమౌళిలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. పారదర్శకంగా విచారణ చేపట్టి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు.కార్యక్రమంలో సీపీఓ వెంకట్రావు, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, జీఎన్ఎస్ఎస్ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాన్ని నిర్దిష్ట ప్రణాళికతో సాధించండి

జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న పనులను నిర్దిష్ట ప్రణాళికతో చేపట్టి లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జేసీ సాయికాంత్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనాలతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహ హక్కు, ఓటీఎస్ ప్రక్రియ యాక్షన్ ప్లాన్, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, పురోగతి తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమపథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఇప్పటివరకు ప్రారంభం కాని ఇళ్లన్నీ వెంటనే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు వెంకట రమణ; శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం

- పారిశుధ్య పనుల నిర్వహణకు రోజువారీ కూలీతో 200 మంది వర్కర్లు
- మ్యుటేషన్ ఫీజు పెంపునకు అనుమతి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్‌ను ఆమోదిస్తూ స్టాండింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సోమవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన ఆయన చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.569.46కోట్లతో రూపొందించిన అంచనాలను, 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.228.65 కోట్లతో సవరించిన అంచనాలను ఆమోదించారు. నగరపాలక సంస్థ ఆదాయాన్ని పెంచుకోవడానికి గల మార్గాలను అన్వేషించాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆస్తులకు సంబంధించి పేరు మార్పు చేసేందుకు వసూలు చేస్తున్న ఫీజును పెంచాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ ఎంత రిజిస్ట్రేషన్ విలువకు ఎంతమేరకు పెంచాలనే విషయం చర్చించి నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. నగరపాలక సంస్థ 15వ ఆర్థిక సంఘం నిధులతో కొత్తగా కొనుగోలు చేసిన స్వీపింగ్ మెషిన్ నిర్వహణకు టెక్నికల్ స్టాఫ్, డ్రైవర్లు కార్పొరేషన్‌లో లేనందున రోజుకు 6 గంటలు చొప్పున ఒక ఏడాది పాటు నిర్వహించడానికి గంటకు రూ.1200 చొప్పున టెండర్లు ఆహ్వానించాలని నిర్ణయించారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారు 2019లో కొనుగోలు చేసిన మూడు మినీ స్వీపింగ్ మెషిన్లలో రెండు పనిచేస్తున్నందున వాటిని కూడా గంటకు రూ.820తో టెండర్లు పిలవాలని తీర్మానించారు. నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ జోన్లలో, మలేరియా విభాగంలో పారిశుధ్య పనుల నిర్వహణకు, రోడ్ల స్వీపింగ్, కాలువల క్లీనింగ్, ట్రాక్టర్ లోడింగ్ పనులు చేయడానికి రోజుకు రూ.400 కూలీతో 200 మందిని టెండర్ ప్రక్రియ ద్వారా వినియోగించుకునేందుకు, వారి వేతనాలను జనరల్ ఫండ్ నుంచి చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, మేసా ప్రమీల రాణి, షఫీ, వి. శిరీష, ఎస్ఈ రత్నాల రాజు, సీపీ సంజీవ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఈఈ నారాయణస్వామి, ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్ఓ డా. ప్రశాంత్‌వర్ధన్, డీఈఈలు, ఆర్ఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు తలనీలాల సేకరణకు వేలం

గోపవరం : మండలంలోని మల్లెంకొండేశ్వర స్వామి ఆలయంలో తలనీలాల సేకరణ కోసం బుధవారం వేలంపాట నిర్వహించనున్నట్లు కార్య నిర్వహణాధికారి సి.శివయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు మల్లెంకొండేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని బద్వేలు దేవదాయ శాఖ కార్యాలయంలో అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు రెండు రోజుల పాటు తలనీలాలు సేకరించుకునేందుకు వేలం పాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాల కోసం దేవదాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

పట్టపగలే రెండు చోట్ల చోరీలు

కొండాపురం : మండలంలో సోమవారం పట్టపగలే రెండు చోట్ల చోరీలు జరిగాయి. తాళ్లప్రొద్దుటూరు, కొండాపురంలో తాళం వేసిన ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. కొండాపురంలోని కడప–తాడిపత్రి నూతన బైపాస్ రోడ్డు సమీపంలోని పాలకోవ సెంటర్ దగ్గరలో ఉండే రంగాంజినేయులు ఇంట్లో చోరీ జరిగింది. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లగా.. ఈ సంఘటన జరిగింది. చోరీకి ఎంత గురైంది అనే విషయం తెలియాల్సి ఉంది. తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన మల్లేశ్వర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో పాలతల దేవస్థానం వెళ్లారు. ఇదే అదునుగా భావించి దొంగలు ఇంటిలోని బీరువా పగలగొట్టి 8 తులాల బంగారం తీసుకెళ్లారు. ఘటన స్థలాలను కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్‌ఐ జె.రవికుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

పీలేరు : కారుతో సహా రూ.8 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ క్షేత్రాధికారి రామ్లానాయక్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున మార్లేళ్ల వైపు నుంచి వచ్చిన కారును అటవీ సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించగా.. చీకటిలో వేగంగా ముందుకు తీసుకెళ్లి రోడ్డు పక్కన ఆపి పరారయ్యారు. వాహనాన్ని తనిఖీ చేయగా 174 కేజీల బరువు గల ఎనిమిది ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. వాహనంతోపాటు ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

దుర్గమ్మా.. పాహిమాం..

ఘనంగా విజయదుర్గ ఆలయ బ్రహ్మోత్సవాలు

కడప కల్చరల్ : 'దుర్గమ్మా.. పాహిమాం' అంటూ భక్తులు శరణు వేడారు. కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన సోమవారం శ్రీ విజయదుర్గ, మల్లికార్జునస్వామిలకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, షోడశ ఉపచార పూజలు చేశారు. దూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ మండపంలో శ్రీ చక్రం సన్నిధిలో భక్తులు, ఉభయదారులు శ్రీ చక్రార్చన నిర్వహించారు. యాగ మండపంలో వేద పండితులు రాయపెద్ది సుబ్బరామశర్మ ఆధ్వర్యంలో చండీహోమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం మహిళా భక్తులు సామూహికంగా లలిత, శ్రీ విజయదుర్గ సహస్ర నామ పారాయణం చేశారు. రాత్రి అలంకరించిన పులి వాహనంపై శ్రీ విజయదుర్గ, మల్లికార్జునులను కొలువుదీర్చి భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఆలయ ప్రదక్షిణ చేయించారు.

నేడు కల్యాణోత్సవం

శ్రీ విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మాఘ బహుళ విధియ నాడు అమ్మవారు కడప నగరంలో కొలువుదీరిన పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పంచవింశతి కలశాభిషేకం, చండీహోమం, శ్రీ చక్రార్చన, సాయంత్రం 3.30 నుంచి ఆలయ ప్రాంగణంలో శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవం, రాత్రి 8.30 గంటలకు నగరోత్సవం నిర్వహిస్తారు.



వృషభ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీ విజయదుర్గ మల్లికార్జునులు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

దయగల తల్లి.. లూర్దుమాత

- ఘనంగా మరియాపురం తిరునాల
- ఫాదర్ లక్కినేని ఆరోగ్యస్వామి



ప్రార్థన నిర్వహిస్తున్న గురువులు

కడప కల్చరల్ : దయగల తల్లి అమలోద్భవి లూర్దుమాత సన్నిధి అత్యంత పవిత్రమైనదని, భక్తులకు ప్రీతికరమైనదని ఫాదర్ లక్కినేని ఆరోగ్యస్వామి అన్నారు. కడప నగరం మరియాపురంలోని పాత చర్చి ఆవరణలో తిరునాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం జరిగిన ఆధ్యాత్మిక సభలో ఆయన ప్రధాన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పైడికాల్వ విచారణ గురువులు సోమిరెడ్డిపల్లె చిన్నప్ప దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం ఫాదర్ ఆరోగ్యస్వామి మాట్లాడుతూ పాపమనే అంధకారంలో ఉన్న వారిని రక్షించేందుకు లోకరక్షకుడు ఈ ప్రపంచానికి మరియ ద్వారా రావడం అద్భుతమైన సంఘటనగా వర్ణించారు. ప్రపంచాన్ని రక్షించడానికి దేవుడు మరియమ్మను తల్లిగా ఎంచుకున్నాడని తెలిపారు. బాల్యం నుంచి ఆమె భక్తితో పెరిగిందని, దైవ సన్నిధిలో పరిపూర్ణమైన ధన్యతను సంతరించుకుని మానవులందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. మహిళా లోకానికి ఆమె ఆదర్శమూర్తి అని అభివర్ణించారు. ప్రారంభంలో మరియమాత స్వరూపంతో పల్లకీపై మరియాపురం వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రధాన వేదిక వద్ద లూర్దుమాతను కొలువుదీర్చి ప్రార్థనలు చేశారు.

కడప డీన్ పెండ్లికట్ల అబ్రహం, ఎంపీఎస్ ఎస్ఎస్ డైరెక్టర్ ఫాదర్ బాలరాజు, తిరునాల కమిటీ చైర్మన్ వారాది జోసెఫ్, కార్యదర్శి లూర్దు, కోశాధికారి యు.విజయభాస్కర్ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులు భక్తిగీతాలను ఆలపించారు. పాలెంపల్లె ఉపదేశి మద్దెల ఆనంద్‌రావు గురువులను సత్కరించారు.

చక్రస్నానం.. సర్వపాపహరణం

సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజావరోహణం



నీటి కొలనులో చక్రస్నానం ఆచరిస్తున్న ఆలయ అర్చకులు, భక్తులు

పులివెందుల టౌన్ : పులివెందుల నడిబొడ్డులో వెలసిన శ్రీవేంకటరమణుడి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో చివరి ఘట్టమైన చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలో ఉన్న కొలనులో చక్రస్నానం ఇత్యాది పూజా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా స్నపన తిరుమంజనాన్ని ఆలయ అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారికి పాలు, పెరుగు, పంచామృతంతో అభిషేకించి తిరుమల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శ్రీగంధం, కుంకుమ పువ్వులేపనంతో అలంకరించారు. తులసిమాల, సుగంధ వట్టివేరు మాలలతో అలంకరించి మంగళ స్నానాలు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవిందా.. గోవిందా అంటూ దేవదేవున్ని వేడుకున్నారు. మహా మంగళహారతులు పట్టారు. ఉభయదారులు తల్లం చంద్రమౌళి దంపతులకు స్వామివారి మాలలను అందజేసి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన కొలనులో చక్రస్నానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు కూడా ఆ కొలనులో మునిగి తేలారు. చక్రస్నానం నిర్వహించేటప్పుడు స్నానమాచరిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఊంజల సేవ చేపట్టి ఉభయదారులతో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వామి వారికి తిరుప్పావడి (అన్నంతో స్వామివారి ప్రతిమ)నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం యాగశాలలో కళశారాధన ప్రధాన నిత్య హోమాలు, విశేష హోమాలు చేసి పూర్ణాహుతి చేపట్టారు. ధ్వజాఅవరోహణం చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నేడు ఏకాంత సేవ

వేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయంలోని అద్దాల మండపంలో ఏకాంత సేవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు తెలిపారు. స్వామి ఏకాంత సేవలో భక్తులు పాల్గొని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ఫోర్జరీ నియామక పత్రంతో దొరికిపోయింది

- ఉద్యోగంలో చేరడానికి వెళ్లిన వైనం
- బోగస్ పత్రాలుగా నిర్ధారించిన అధికారులు
- వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీ కార్యాలయ పరిధిలో ఘటన

కడప రూరల్ : ప్రభుత్వ ఉద్యోగం కోసం ఆమె దొంగ దారిలో వెళ్లింది. ఏకంగా ఉద్యోగ నియామక పత్రాన్నే సృష్టించింది. అందులో అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసింది. ఉద్యోగంలో చేరడానికి వెళ్లింది. అధికారులు ఆరా తీయడంతో అడ్డంగా దొరికిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ ఏడాది జనవరి 17న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మీటింగ్ హాల్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్ జరిగింది. ఈ నియామకాలకు సంబంధించి చిత్తూరు జిల్లాకు చెందిన హారతి తాను స్టాఫ్ నర్స్ పోస్టుకు ఎంపికైనట్లు, కడపలోని వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయం అధికారులు చిత్తూరు జిల్లా పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోస్టింగ్ ఇచ్చినట్లుగా ఆ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేసింది. ఆ నియామక పత్రంను చూసిన అధికారులు పూతలపట్టు పీహెచ్‌సీలో నిబంధనల ప్రకారం నలుగురు స్టాఫ్ నర్సులు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని అక్కడి అధికారులు కడపలోని వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ అధికారులకు తెలిపారు. ఆ వివరాలను ఇక్కడి ఆర్డీ కార్యాలయ అధికారులు పరిశీలించారు. అందులో ఈ నెల 3న కౌన్సెలింగ్ జరిగినట్లుగా ఉంది. ఆ రోజు అధికారులు ఇక్కడ ఎలాంటి కౌన్సెలింగ్ నిర్వహించలేదు. అలాగే ఆ నియామక పత్రంలో రీజనల్ డైరెక్టర్, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ అధికారుల సంతకాలు ఉన్నాయి. అవి ఫోర్జరీ సంతకాలుగా గుర్తించారు. అసలు నియామకపత్రం, పోస్టింగ్ ఆర్డర్ కాపీనే ఒక బోగస్ అని తేల్చారు. ఎవరైనా అడ్డదారుల్లో ఉద్యోగం సంపాదించడానికి నకిలీ సర్టిఫికెట్స్‌ను తెచ్చుకుంటారు. ఈ మహిళా అభ్యర్థి ఏకంగా నకిలీ ఉద్యోగ నియామక పత్రంనే సృష్టించడం సంచలనంగా మారింది.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ఆ పత్రాలను పరిశీలించాం. అవి బోగస్ నియామక పత్రాలు. ఆ మహిళా అభ్యర్థిపై చర్యలకు పోలీసులకు ఫిర్యాదు చేశాం. ఎవరైనా ఇలాంటి పనులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కోటేశ్వరి, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం

సంగమేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

వీరపునాయునిపల్లె : మండల పరిధిలోని సంగమేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి, ఆలయ అధికారి జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం ఆదాయం 4.85 లక్షల రూపాయలు వచ్చినట్లు తెలిపారు. గత శివరాత్రి నుంచి ఇప్పటి వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు లెక్కించినట్లు చెప్పారు. గతేడాదితో పోల్చుకుంటే రెట్టింపు అయిందని తెలిపారు. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రమణ్యశర్మ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం



బాబా ఫక్రుద్దీన్ (ఫైల్)

రాజంపేట/సింహాద్రిపురం : కడప –రేణిగుంట జాతీయ రహదారిలోని రాజంపేట బైపాస్ రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సింహాద్రిపురం మండల పరిధిలోని బిదినంచర్ల గ్రామానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ (18) రాజంపేటలోని ఏఐటీఎస్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బయట హాస్టల్‌లో ఉంటూ చదువుతుండే వాడు. సోమవారం కళాశాలకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో ముందు హైదరాబాదు నుంచి చెన్నైకి వెళుతున్న లారీని ఓవర్ టేక్ చేయబోయాడు. ఎదురుగా కారు రావడంతో అదుపు తప్పి లారీ కంటైనర్ కింద పడిపోయాడు. దీంతో శరీరం నుంచి తల తెగిపోయింది. అక్కడి నుంచి 400 మీటర్ల వరకు మొండం, బైకును లారీ ఈడ్చుకెళ్లింది. ఈ దృశ్యం చూసిన వారంతా భయాందోళనకు గురయ్యారు.



సంఘటన స్థలంలో మృతి చెందిన బాబా ఫక్రుద్దీన్

సంఘటన స్థలానికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి చేరుకున్నారు. ప్రమాద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాబా ఫక్రుద్దీన్ తండ్రి గతంలో చనిపోగా.. తల్లి కూలీ పనులు చేసుకుంటూ చదివిస్తూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో కుమారుడు కూడా చనిపోవడంతో ఆమె గుండెలవిసేలా రోదించింది. రాజంపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లారీ క్యాబిన్‌కు కర్ణాటక రిజిస్ట్రేషన్, కంటైనర్ ఉన్న బాడీకి హర్యానా రిజిస్ట్రేషన్ ఉండటంతో పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా..

- మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు • వృద్ధుడి దుర్మరణం



మృతి చెందిన దస్తగిరి

చాపాడు : ఆస్పత్రికి వెళ్లి మోటారు సైకిల్‌పై వస్తున్న ఓ వృద్ధుడిని కారు ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. మండలంలోని నాగులపల్లె వద్ద మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై సోమవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గోపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన తొండలదిన్నె దస్తగిరి(68) మైదుకూరులోని కడప రోడ్డులో నివాసం ఉంటున్నాడు. ప్రొద్దుటూరు వైద్యశాలకు వెళ్లి మోటార్ సైకిల్‌పై వస్తుండగా మండల పరిధిలోని నాగులపల్లె వద్ద వెనకవైపు నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దస్తగిరికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చాపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై భార్య, బంధువుల దాడి



గాయపడిన ఇర్ఫాన్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏఎస్ఆర్ నగర్‌లో నివాసం వుంటున్న ఇర్ఫాన్ (30)పై భార్య, బంధువులు దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబంలో ఏర్పడిన మనస్పర్థలతో భార్య మిస్బా, భార్య మేనమామ, ఆటో డ్రైవర్ జమాలుద్దీన్, అత్త ఫయాజా, మామ బాబ్‌జాన్, మరదలు దాడి చేశారు. ఇర్ఫాన్ తలపై రాయితో జమాలుద్దీన్ దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడు అస్వస్థతకు గురయ్యాడు. స్థానికుల సాయంలో అతన్ని కడప రిమ్స్‌లో చేర్పించారు. కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఉలసయ్య తెలియజేశారు.

ఆటోను ఢీకొన్న లారీ

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



మృతి చెందిన సుబ్బయ్య

రైల్వేకోడూరు : మండలంలోని శెట్టిగుంట ప్రధాన రహదారిపై సోమవారం ఆటోను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఓబులవారిపల్లె మండలం గోవిందంపల్లెకు చెందిన నూకరాజు సుబ్బయ్య(70)కు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తిరుపతికి తీసుకెళ్లి చికిత్స చేయించుకుని.. ఆటోలో తిరుగు పయనమయ్యారు. ఆ ఆటో శెట్టిగుంట వద్దకు రాగానే వెనుక వైపు అతి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నూకరాజు సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందగా.. శ్రీను, వెంకటేష్, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. సుబ్బయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీని స్వాధీన పరుచుకుని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గేదెలను తప్పించబోయి..

- రోడ్డు ప్రమాదానికి గురై..
- కుమారుడి మృతి, తండ్రికి తీవ్ర గాయాలు



ఆనంద్ (ఫైల్)



సంఘటనా స్థలంలో ఆనంద్ మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : అడ్డు వచ్చిన గేదెలను తప్పించబోయి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనలో కుమారుడు మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చాపాడు మండలంలోని నక్కలదిన్నె గ్రామానికి చెందిన రాజారత్నం కూలి పని చేస్తూ జీవనం సాగించేవాడు. అలాగే కుటుంబ పోషణ కోసం ఇంటి వద్ద చిన్నపాటి కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య మేరితోపాటు కుమారులు ప్రేమ్‌కుమార్, ఆనంద్ అలియాస్ మహేష్‌కుమార్ (15) ఉన్నారు. కుమారులిద్దరూ కూలి పనికి వెళ్తుంటారు. ఈ క్రమంలో కిరాణా సరుకుల కోసం సోమవారం కుమారుడు ఆనంద్‌ను వెంట పెట్టుకొని రాజారత్నం బైక్‌లో ప్రొద్దుటూరుకు బయలుదేరాడు. బొజ్జవారిపల్లె క్రాస్ వద్ద ఎదురుగా గేదెలు అడ్డు రావడంతో.. వాటిని తప్పించే క్రమంలో వెనుక వైపు వస్తున్న లారీ ఢీకొంది. బైక్‌లో వెనుక కూర్చున్న ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందగా, రాజారత్నంకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు ఇలా జరగడంతో మేరి గుండెలవిసేలా రోదించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హైమావతి తెలిపారు.

మెనూ ప్రకారం వడ్డించకుంటే చర్యలు



రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట గురుకులంలో మాట్లాడుతున్న విజయ ప్రతాప్‌రెడ్డి

రైల్వేకోడూరు రూరల్/పెనగలూరు/పుల్లంపేట : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించకుంటే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని రైల్వేకోడూరు, పెనగలూరు, పుల్లంపేటలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రైల్వేకోడూరు మండల పరిధి కుక్కలదొడ్డి, శెట్టిగుంట పంచాయతీల్లోని ప్రభుత్వ రేషన్ షాపులను తనిఖీ చేశారు. అనంతరాజుపేట పంచాయతీలోని అంగన్వాడీ సెంటరు – 2ను పరిశీలించారు. అదే పంచాయతీలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. పెనగలూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లోని హాస్టల్, కస్తూర్బా పాఠశాల హాస్టల్, సోషల్ వెల్ఫేర్ ఎస్సీ హాస్టల్, చౌక దుకాణాన్ని పరిశీలించారు. పుల్లంపేట మండల పరిధిలోని ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె షామీర్ బాషా, డీఎస్‌ఓ రఘురాం తదితరులు పాల్గొన్నారు.